క్లుప్తంగా

దరఖాస్తులు ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో పార్ట్‌టైం గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ సెట్, నెట్, పీహెచ్‌డీ కలిగిన వారై ఉండాలన్నారు. జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులలో రెండేళ్ల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల ఈనెల 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రీడా మైదానం పరిశీలన

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్న సీఎం కప్ 2023 క్రీడల కోసం ఎంపీపీ జైవంత్‌రావు, ఎంపీడీవో తిరుమల క్రీడా మైదానాన్ని బుధవారం పరిశీలించారు. మండల స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రత్యేకాధికారి మహేశ్, ఎస్సై సుమన్ పాల్గొన్నారు.

'నాయకులకు సామాజిక బాధ్యతలేదా?'

నేరడిగొండ: నాయకులకు సామాజిక బాధ్యత లేనదని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ) జిల్లా కోఆర్డినేటర్ కుడాల స్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల అంబేద్కర్ జయంతి రోజున బుగ్గారం(బి) గ్రామంలో జరిగిన ఘటనపై ప్రజా నాయకులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రధాన పార్టీల్లో మండలం నుంచి ఎమ్మెల్యేలుగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్న నాయకులు సైతం ఇప్పటి వరకు గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవని విమర్శించారు. సమావేశంలో నాయకులు కారెం రవి, గజ్జల శంకర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న మహమ్మద్ ఇమ్రాన్

ఆదిలాబాద్: దివ్యాంగుల కోసం జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా కాలనీ ఏర్పాటు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో చాలా మంది దివ్యాంగులకు ఇళ్లు కేటాయించలేదన్నారు. అదే విధంగా పలు కారణాలతో ఎంతోమంది పెన్షన్ నిలిపివేశారని, వెంటనే పునరుద్ధరించాలన్నారు. సమావేశంలో పైజల్, సాజిద్, మోసిన్, ముస్తఫా పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి


బుద్ధ విగ్రహాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నార్నూర్: మండలంలోని బోప్పాపూర్ గ్రామంలో ఈనెల 31న నిర్వహించే బుద్ధ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ దుర్గం శేఖర్ కోరారు. బుధవారం థాయిలాండ్ నుంచి తెప్పించిన విగ్రహాన్ని పరిశీలించారు. ఆయన వెంట నాయకులు శైలేందర్ వాఘ్మారే, బాబాసాహెబ్ కాంబ్లే, దాదాసాహెబ్ జబాడే, శ్రీరంగ్ వాఘ్మారే, ప్రభాకర్ పాల్గొన్నారు.

బహుజన రాజ్యం స్థాపిస్తాం


మాట్లాడుతున్న లక్ష్మీకాంత్

ఆదిలాబాద్‌రూరల్: రానున్న రోజుల్లో బహుజన రాజ్యం స్థాపించి అక్రమార్కుల భరతం పడతామని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జాతీయ అధ్యక్షురాలు మాయవతిపై అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో 36 మంది ఎంపీలతో మద్దతు ఇచ్చిందన్నారు. మాయవతి గురించి మాట్లాడే నైతికహక్కు గువ్వల బాలరాజుకు లేదన్నారు. సమావేశంలో ఆదిలాబాద్ అసెంబ్లీ అధ్యక్షురాలు మెస్రం మీనా, మావల మండల కన్వీనర్ సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

పదిలో విద్యార్థుల సత్తా

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల పదో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ యూనుస్ సలీం తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి శ్రీకర్‌ను అభినందించారు. ఇచ్చోడ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం రాథోడ్ ఉదయ్‌రావు తెలిపారు.

నార్నూర్: పది ఫలితాల్లో నార్నూర్, గాదిగూడ మండలాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నార్నూర్ 93 శాతం, గాదిగూడలో వంద శాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈవో రాపల్లి అశన్న తెలిపారు. నార్నూర్ మండలంలోని ఆదర్శ పాఠశాల, తాడిహత్నూర్ ఆశ్రమ పాఠశాల, గాదిగూడలోని ఆశ్రమ పాఠశాల, ఝరి, అర్జునిలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

తలమడుగు: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల, బరంపూర్, ఝరిపూనగూడ, కజ్జర్ల, లింగి, పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. బరంపూర్ గ్రామానికి చెందిన మాడూరి మల్లేశ్వరి 9.7 జీపీఏ సాధించి మండల్ టాపర్‌గా నిలిచింది.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. పొన్నారి, గొట్కూరి పాఠశాల విద్యార్థులు వంతశాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని కప్పర్ల పాఠశాలకు చెందిన కేమ కరణ్ 10 జీపీఏ సాధించి మండలంలో టాపర్‌గా నిలిచారు. సంజన, స్వాతి 9.8, గొట్కూరి పాఠశాలకు చెందిన మహేశ్వరి 9.8 జీపీఏ సాధించింది.

భీంపూర్ విద్యార్థుల సత్తా..

భీంపూర్ మండలంలోని మూడు పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. భీంపూర్, పిప్పల్‌కోటి, కరంజి(టి) పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పిప్పల్‌కోటి పాఠశాలకు చెందిన అలీషా, రూప విద్యార్థినులు 9.3 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచారు. అదే పాఠశాలకు చెందిన వీనిల్, ప్రణయ్ 9.2 జీపీఏ సాధించారు. వీరిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థికి అభినందన

తాంసి: తాంసి మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సర్పంచ్ సదానంద్ తనయుడు కేమ కరణ్ 10 జీపీఏ సాధించాడు. మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని బుధవారం పాఠశాల హెచ్‌ఎం కిష్టన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


సౌరభ్


రక్షిత్ గౌడ్


కార్తీక్ సాయి

బోథ్: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 93.99 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ముగ్గురు విద్యార్థులు పది జీపీఏ సాధించారు. పాఠశాలకు చెందిన డి.సౌరభ్, రక్షిత్‌గౌడ్, కార్తీక్ సాయి పది జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచారు. ఇదే పాఠశాలకు చెందిన భవాని, అభిజ్ఞ రెడ్డి, సాహితి, పల్లవి, వైష్ణవి, సన్నిధి, వైశాలిలు 9.8 జీపీఏ సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ ఉమేష్‌రావు అభినందించారు.

- సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ జీపీఏ సాధించారు. పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. అశ్విత, కావ్య, శిరీష,పావని, సాక్షి, రక్షిత, వైష్ణవిలు 9.8 జీపీఏ సాధించారు.

మండల టాపర్లుగా బాలికలు


రవళిక


సోలంకి నందిని

నేరడిగొండ: పదో తరగతి ఫలితాల్లో నేరడిగొండ మండల టాపర్లుగా బాలికలు ముందంజలో ఉన్నారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో బుగ్గారం(బి) గ్రామంలో టీటీడబ్ల్యూ ఆర్‌జేసీ పాఠశాలకు చెందిన రవళిక 9.5 జీపీఏ సాధించగా, నేరడిగొండ జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన సోలంకి నందిని 9.3 జీపీఏ సాధించింది. తేజాపూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఎంఈవో భూమారెడ్డి, జెడ్పీటీసీ అనిల్‌జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకటరమణ, బలరాం జాదవ్, అభినందించారు.

ఉత్తమ ఫలితాలు


హంసప్రియ


బి.రక్షిత

గుడిహత్నూర్: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. మండల వ్యాప్తంగా ఉత్తీర్ణత 94.59 శాతంగా నమోదైంది. కేజీబీవీ విద్యార్థి కదం వైష్ణవి 9.3 జీపీఏ, ఆదర్శ పాఠశాలకు చెందిన బి.హంసప్రియ 9.3 జీపీఏ, బి. రక్షిత 9.3 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. ఇదే పాఠశాలకు చెందిన ఆర్.యశ్విత 9.2 జీపీఏ, ఎస్.దేవీసింగ్ 9.2 జీపీఏ సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఎంఈవో నారాయణ, ప్రిన్సిపాల్ శివాజీ, లావణ్య విద్యార్థులను అభినందించారు.

తగ్గిన ఉత్తీర్ణత


ఎస్. అమృత

బేల: పదో తరగతి ఫలితాల్లో మండల మొత్తంగా 59 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలికలే పైచేయి సాధించారు. మండలంలోని సిర్సన్న జెడ్పీఎస్ఎస్‌కు పాఠశాలకు చెందిన ఎస్. అమృత 9.3 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. కేజీబీవీలో 42 మంది విద్యార్థులకు 14, చప్రాల జెడ్పీఎస్ఎస్‌లో 19 మందికి 3గురు, చంపెల్లి ఎస్టీ బాలికలు ఆశ్రమ పాఠశాలలో 27 మందికి 9, సైద్‌పూర్ ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో 40 మందికి 11మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

బాలాజీ గుట్టకు శోభాయాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: మండల కేంద్రంలోని బాలాజీ గుట్టపై ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మూడు రోజుల పాటు కొనసాగనున్న విగ్రహ ప్రతిష్ఠాపన, మహా పూజ కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ చౌక్ నుంచి బాలాజీ గుట్ట వరకు ప్రతిష్ఠించనున్న వేంకటేశ్వరస్వామి విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బంజారా జాతీయ దీక్ష భూమి కొత్తపల్లి- హెచ్ దీక్ష గురువు ప్రేంసింగ్ మహరాజ్ పాల్గొన్నారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన, యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రాథోడ్ విఠల్, విగ్రహ దాత పవార్ మోబిలాల్, అడే ఇంద్రజీత్, జ్ఞానోబా పుస్కర్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ రావు జయంతి


నినాదాలు చేస్తున్న నాయకులు


నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: మాలమహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పీవీ రావు 74వ జయంతిని మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని న్యూహౌజింగ్‌బోర్డు కాలనీ సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న మాట్లాడుతూ.. పీవీ రావు మాలమహానాడు స్థాపించి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. ఈవిషయం సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని, ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో బేర శ్రీనివాస్, చిల్క పోచ్చన్న, నిమ్మల ప్రశాంత్, క్రాంతి, కిరణ్, మారుతి పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల విఘ్నేశ్వరరావు జయంతిని ఐక్య మాల సంక్షేమ సంఘం వేదిక ఉట్నూర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సుభాశ్ బొంకంటి పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కరీం, అర్జున్, స్వామి, దాస్, వెంకటేశ్, రాజయ్య, సూర్య, వంశీ గణేశ్, ఆనంద్‌బాబు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులు పంట మార్పిడి పాటించాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజశేఖర్

తలమడుగు: రైతులు పంట మార్పిడి పాటించాలని వ్యవసాయ పరిశోధన స్థానం ఆదిలాబాద్ శాస్త్రవేత్త రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహారాష్ట్ర బ్యాంకు స్పెషల్ అసిస్టెంట్ కాడే స్వామి ఆధ్వర్యంలో రైతులకు ఆత్మీయ సన్మానం, అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో మహేందర్, ఝరి సహకార సంఘ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ చంటి, కజ్జర్ల సర్పంచ్ మెట్టి వెంకటమ్మ కిరణ్‌కుమార్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన గత ప్రభుత్వాలు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: గత ప్రభుత్వాలు అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని, తెలంగాణ ఏర్పడిన తరువాత వేల కోట్ల వ్యయంతో ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలో రూ.2 కోట్ల 20 లక్షలతో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి బుధవారం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించేందుకు కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. త్వరలోనే రూ.55 కోట్లతో నిర్మించనున్న కలెక్టరేట్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, రాంకుమార్ పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి కృషి

ఆదిలాబాద్‌రూరల్: అన్నదాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మండలంలోని చిట్యాల్ బోరి గ్రామానికి చెందిన రైతు ఆడే ముత్యాలు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు మంజూరైన రైతుబీమా చెక్కును ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గంగ్రత్ రమేశ్, జైనథ్ ఎంపీపీ గోవర్ధన్, సర్పంచ్ కుమ్ర లక్ష్మీ వసంత్‌రావ్, పీఏసీఎస్ చైర్మన్ పరమేశ్వర్ పాల్గొన్నారు.

సంకల్ప బలంతో లక్ష్యాన్ని సాధించవచ్చు

ఆదిలాబాద్: సంకల్ప బలంతో ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ అనిల్ దేశ్పాండేకు ఇటీవల అంతర్జాతీయస్థాయిలో అవార్డు రావడంతో జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఇప్పటి వరకు అనిల్ 161 అవార్డులు సాధించారని, అంతర్జాతీయ స్థాయిలో తాజాగా ఫొటోగ్రఫీ సొసైటీ ఆఫ్ అమెరికా సంస్థ బంగారు పతకం సాధించడం జిల్లాకే గర్వకారణమన్నారు.

'రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి'

తలమడుగు: రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని బీజేపీ గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. బుధవారం మండలంలోని లింగి, పల్సి(బి), పల్సి(కే), పల్సితండా, దహెగాం, కొసాయి, ఉమ్రి, కప్పర్ దేవి, డోర్లీ, తలమడుగు, రుయ్యాడి, కొత్తూర్ గ్రామాల్లో పర్యటించారు. బీఆర్ఎస్ హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోనగిరి స్వామి, ప్రధాన కార్యదర్శి ముత్యాల దేవన్న, ధనుంజయ్, బర్ల కైలాష్, రవి పాల్గొన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పులిమడుగు మాజీ సర్పంచు ఆడే దత్తరామ్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఎమ్మెల్యే రేఖానాయక్ బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ బాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాం, సాజిద్, అజీం పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌అర్బన్: తెలంగాణ ఆటో యూనియన్ అధ్యక్షుడు నయింను డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పరామర్శించారు. ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న ఆయనను ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పట్టణాధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్, సేవాదళ్ అధ్యక్షుడు మోతీరాం, రాజు యాదవ్ ఉన్నారు.

సన్మానం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కుమ్మరికుంట గ్రామంలో జిల్లా జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్‌ను ఆదివాసీలు ఘనంగా సన్మానించారు. గ్రామంలోని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తమ గ్రామానికి ఆహ్వానించారు. అనంతరం గ్రామస్తులందరూ సమావేశం నిర్వహించారు. ఆయన వెంట జీవ వైవిధ్య మేనేజ్‌మెంట్ జిల్లా కమిటీ సభ్యులు మర్సుకోల తిరుపతి పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సుభద్రను అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తన కార్యాలయంలో కలిసి సన్మానించారు. కె.రాధ, సునంద, కవిత, నర్సమ్మ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుళ్లు ఇటీవల బదిలీ అయ్యారు. కాగా.. బుధవారం సీఐ సత్యనారాయణ, ఎస్సై హరిబాబు సన్మానించారు.

మందుబాబుల వీరంగం


మందుబాటిళ్లను చూపిస్తున్న వాకర్లు

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మందుబాబుల ఆగడాలు శృతిమించుతున్నాయి. రాత్రిపూట మైదానంలో మద్యం తాగి హంగామా సృష్టిస్తున్నారు. బాటిళ్లను పగలగొట్టి, కళాశాల ఆవరణలో పడేస్తున్నారు. దీంతో ఉదయం పూట వాకింగ్ వచ్చే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు స్పందించి రాత్రి పూట గస్తీ చేపట్టాలని వారు కోరుతున్నారు.

నిరుపయోగంగా క్రీడా మైదానాలు


నిరుపయోగంగా ఉన్న క్రీడా మైదానం

- అందుబాటులో లేని ఆట వస్తువులు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

ఆదిలాబాద్‌రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసింది. కానీ అందులో క్రీడా సామగ్రి అందుబాటులో లేక పోవడం, కొన్ని గ్రామాల్లో గ్రామానికి దూరంగా ఉండడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఆదిలాబాద్ రూరల్ మండలంలో 34 గ్రామ పంచాయతీలతో పాటు అనుబంధ గ్రామాల్లో సైతం క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. మండలంలోని అంకోలి, మామడిగూడ, చించుఘాట్ గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలకు సుమారు రూ. 60 వేల చొప్పున ఖర్చు చేశారు. వీటిలో మాత్రమే ఆటలు ఆడడం, వ్యాయామం చేయడం వంటివి చేస్తున్నారు. అలాగే యాపల్‌గూడలో ఏర్పాటు చేసిన మైదానంలో నెట్ ఏర్పాటు చేసి క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్నారు.

అలకారప్రాయంగా..

ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడామైదానంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, వ్యాయామం చేసుకోవడానికి సింగిల్ బార్స్‌లు ఏర్పాటు చేశారు. ఆయా క్రీడా మైదానాల్లో సామగ్రి లేకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. అధికారులు స్పందించి క్రీడా పరికరాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల యువకులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం



గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున క్రీడా మైదానం ఏర్పాటు చేశాం. మండలంలోని చాలా గ్రామాల్లో యువకులు ఆటలు ఆడుతున్నారు. కొన్ని చోట్ల ఉపయోగంలో లేకపోతే వాటిని ఉపయోగంలోకి తీసుకువచ్చేలా కృషి చేస్తా.

– లక్ష్మీకాంత్‌రావ్, ఎంపీడీవో, ఆదిలాబాద్ రూరల్

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డు నిర్మించేదెప్పుడో?



బజార్‌హత్నూర్: మండలంలోని యేసాపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామం ఏర్పడి 70 సంవత్సరాలు గడిచినా.. ఇప్పటి వరకు బీటీరోడ్డు లేక మట్టి రోడ్డుపై వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలి.

- సంబంధిత అధికారి: నర్సింగ్, పీఆర్ ఏఈ, ఫోన్: 96763 43109

మెరుగైన తపాలా సేవలు అందిస్తాం


నూతన బ్రాంచీని ప్రారంభిస్తున్న ఐపీవో

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు మెరుగైన తపాలా సేవలు అందిస్తామని తపాలాశాఖ ఐపీవో సుజీత్‌కుమార్ అన్నారు. బుధవారం గాదిగూడ మండలంలోని ఖాండోవ్, పర్సువాడ (కే) గ్రామాల్లో నూతన బ్రాంచీ కార్యాలయాన్ని ప్రారంభించారు. జిల్లాల్లో జిల్లాలో మొత్తం ఏడు నూతన బ్రాంచీలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దశల వారీగా సేవలను విస్తరిస్తామన్నారు. తపాలాశాఖ అధికారి రమేశ్, సర్పంచ్ దత్తహరి, పర్సువాడ సర్పంచ్ ఆడ గంగుబాయి, ఇన్‌చార్జి బీపీఎంలు శివ, తానాజీ పాల్గొన్నారు.